క్లుప్తంగా

భూ సమస్యల పరిష్కారానికే గ్రామసభలు

సీతానగరం: గ్రామాల్లో నెలకొన్న భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు మంగళవారం తెలిపారు. గ్రామాల్లో నిర్వహిస్తున్న సభల్లో రైతులు తమ సమస్యలపై వినతులు అందజేయాలన్నారు. తద్వారా వారి భూముల సమస్యలుంటే పరిష్కరించుకోవాలని కోరారు.

108 ఉద్యోగుల నిరసన



మక్కువలో నిరసన తెలుపుతున్న 108 ఉద్యోగులు

మక్కువ: గత మూడు నెలలుగా జీతాలను కూటమి ప్రభుత్వం చెల్లించకపోవడంతో 108 ఉద్యోగులు నిరసనకు దిగారు. గత మూడు రోజుల నుంచి 108 ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలను ధరించి, నిరసన తెలియజేస్తున్నా, కూటమి ప్రభుత్వం జీతాలను విడుదల చేయలేదు. పనిభారం ఎక్కువగా ఉండటంతో పాటు ఉద్యోగభద్రత తమకు కరువైందని, అందుకు తోడు గత మూడు నెలలుగా జీతాలు చెల్లించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

విధి నిర్వహణలో అంగన్‌వాడీ కార్యకర్త మృతి



బొమ్మి బంగారమ్మ (ఫైల్)

సాలూరు రూరల్: మండలంలోని కరాసువలస పంచాయతీ దత్తివలస గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త బొమ్మి బంగారమ్మ(55) మంగళవారం తన విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో మృతి చెందింది. ఆమెకు ఇద్దరు పిల్లలు. భర్త పాచిపెంట మండలం చాకిరేవువలస గిరిజన సంక్షేమ శాఖలో ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నారు. ఆమె మృతికి సాలూరు అర్బన్, రూరల్ ఐసీడీఎస్ కార్యకర్తలు, సిబ్బంది సంతాపం తెలిపారు.

ఆర్థిక సాయం అందజేత



ఆర్థిక సహాయం అందిస్తున్న అక్షరకీర్తి ఫౌండేషన్ సభ్యులు

మక్కువ: మండలంలోని గోపాలపురం గ్రామానికి చెందిన సింగనాపూరి కొండమ్మ అనారోగ్యంతో బాధపడుతుండటంతో, వైద్య చికిత్స నిమిత్తం అక్షరకీర్తి ఫౌండేషన్ సభ్యులు శంబంగి భానుప్రసాదు, సాయిరామ్ ఆర్థిక సహాయం అందించారు. మంగళవారం మహిళా ఇంటికి వెళ్లి, ఆమె భర్త శంకరరావుకు 6వేల రూపాయిలు నగదును అందజేశారు. ముస్ముందు మరే అవసరం ఏర్పడిన, తమకు తెలియజేస్తే, వైద్య చికిత్స కోసం ఫౌండేషన్ తరపున సాయం చేస్తామని కొండమ్మ కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు.

ఉత్తమ సేవలతోనే గుర్తింపు



హెచ్‌ఎం భాస్కరరావుకు సన్మానం

బలిజిపేట: సమాజంలో సేవలు అందించే వారికి ఎప్పుడూ మంచి గుర్తింపు ఉంటుందని నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకుడు ఈర్ల సంజీవనాయుడు తెలిపారు. పెదపెంకి ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భాస్కరరావు ఇటీవల ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా మంగళవారం ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వృత్తి ఆదర్శవంతమైందన్నారు. సమాజంలో ఏ వృత్తికి లేనంత గుర్తింపు ఒక్క ఉపాధ్యాయుడికే ఉంటుందన్నారు. సమాజ నిర్దేశకుడు ఉపాధ్యాయుడని పేర్కొన్నారు. కార్యక్రమంలో యువకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఈవీఎం గోదాముల తనిఖీ

పార్వతీపురం టౌన్: పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఈవీఎం గోదాములను కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీలో భాగంగా మంగళవారం ఆయన గోదాములను సందర్శించి అక్కడి పరిస్థితిని పరిశీలించారు. గోదాములకు వేసి ఉన్న సీల్, వేసిన తాళాలు, వెలుపల ఉన్న సీసీ కెమెరాల పనితీరును చూశారు. భద్రతా సిబ్బంది, అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట డీఆర్‌ఓ జి.కేశవనాయుడు, ఎన్నికల విభాగం అధికారులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

'పచ్చబిళ్ల' ఉన్న వారికే గోశాలలు

- పచ్చబిళ్ల కట్టుకో.. గోశాలలు తెచ్చుకో..
- అరకొరగా మంజూరు
- అధికార పార్టీ అనుచరులకే పట్టం



ఆరుబయట ఉన్న మేకలు, గొర్రెలు



బలిజిపేట: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సంక్షేమ పథకాలకు అర్హతే ప్రమాణికంగా ఉండేది. కూటమి ప్రభుత్వంలో పచ్చబిళ్లకే పట్టం కట్టే పరిస్థితులు నెలకొన్నాయి. జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమం పార్టీలకతీతంగా అందేది. ఇప్పుడు దరఖాస్తుదారుల్లో ఎవరు పచ్చబిళ్ల కలిగి ఉంటారో వారికే ప్రాధాన్యత ఇచ్చేలా తయారైంది. గోశాలల షెడ్లకు దరఖాస్తులు చేసుకోవాలని ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు ముందుకొచ్చి జిల్లా వ్యాప్తంగా 909 మంది దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాకు మంజూరైనవి 375. వీటిలో పరిపాలనా ఆమోదం పొందినవి 270 మాత్రమే. మిగిలిన వాటి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకం. 2014 – 2019 మధ్య కాలంలో అప్పటి టీడీపీ పాలనలో నిర్మించిన గోశాలల షెడ్లకు నిధులు మంజూరు కాక లబ్ధిదారులు లబోదిబోమన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వాటికి బిల్లుల చెల్లింపులు చేసి రైతులకు అండగా నిలిచింది. అప్పట్లో గోశాలలు నిర్మించిన వారు ఏ పార్టీ వారైనా బిల్లులు చెల్లింపులు చేసింది. అందుకు తార్కాణంగా బలిజిపేట మండలంలో 98 మందికి రూ.49.36 లక్షలు చెల్లింపులు చేసింది.

లబ్ధిదారుల ఎంపిక ఇలా..

దరఖాస్తులను వెటర్నరీ డాక్టర్ పరిశీలించి అప్రూవల్ చేసి ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులకు పంపిస్తారు. వారు దరఖాస్తులను పరిశీలిస్తారు. లబ్ధిదారుకు సొంతస్థలం ఉందా లేదా అనేది పరిశీలిస్తారు. గ్రామస్థాయిలో గ్రామసభ తీర్మానం అవసరం. దరఖాస్తుతో పాటు పాన్‌కార్డు, జాబ్‌కార్డు, ఆధార్‌కార్డు, స్థల హక్కుపత్రం, బ్యాంకు పాసుపుస్తకం జెరాక్సు కాపీలను జతచేయాలి.

అర్హులకు షెడ్‌లు

ప్రభుత్వ నిబంధనల ప్రకారం అర్హత ఉండే వారికి గోశాలలు మంజూరవుతాయి. ఎవరి వద్దకు తిరగాల్సిన పనిలేదు. గోశాలల దరఖాస్తులు గ్రామాల్లో సేకరించి ఎన్‌ఆర్‌ఈజీఎస్ వారికి అప్పగించడం జరుగుతుంది. తరువాత ప్రక్రియ ఆ శాఖ ద్వారా జరుగుతుంది.

– డాక్టర్ మన్మథరావు, జేడీ, పశుసంవర్ధక శాఖ, పార్వతీపురం మన్యం జిల్లా

పచ్చబిళ్ల ఉంటేనే..

గోశాలల నిర్మాణాలకు టీడీపీ నేతల ఒత్తిళ్లు కనిపిస్తున్నాయి. గతంలో అర్హతే ప్రామాణికంగా ఎంత మంది లబ్ధిదారులు ఉంటే అంతమందికి సంక్షేమ పథకం అమలు జరిగేది. కానీ కూటమి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలకు అర్హులు ఎక్కువగా ఉన్నా అరకొరగా మంజూరులు ఉండడంతో టీడీపీ నేతలకే పథకాలు అనే విధంగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. దరఖాస్తులు కోకొల్లలుగా వచ్చినప్పటికి మిగిలినవి బుట్టదాఖలయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. టీడీపీ నేతలు సిఫార్సు చేసిన వారికే గోశాలలు మంజూరయ్యే అవకాశాలు ఉన్నట్టు విమర్శలు వినిపిస్తున్నాయి.

గోశాల షెడ్లకు రాయితీ విధానం

ఆరు పశువులకు యూనిట్ ధర రూ.2.30లక్షలు, నాలుగు పశువులకు రూ.1.85లక్షలు, రెండు పశువులకు యూనిట్ ధర రూ.1.15లక్షలు చొప్పున నిధులు మంజూరు చేస్తారు. అందులో 90శాతం రాయితీ పోను 10శాతం లబ్ధిదారుల వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. గొర్రెల పెంపకందారులకు 50జీవాలు ఉంటే యూనిట్ ధర రూ.2.30లక్షలు, 20జీవాలు ఉంటే రూ.1.30లక్షలు. దీనిలో 70శాతం రాయితీ పోగా 30శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. 200కోళ్ల పెంపకం కోసం యూనిట్ ధర రూ.87వేలు కాగా 70శాతం రాయితీ పోను 30శాతం లబ్ధిదారుని వాటాగా చెల్లించాల్సి ఉంటుంది. షెడ్ల నిర్మాణం కోసం చిన్న, సన్నకారు రైతులతో పాటు దారిద్ర్య రేఖకు దిగువన ఉన్నవారు, ఎస్సీ, ఎస్టీలు, అంగవైకల్యం ఉన్నవారు, మహిళా యజమానులు అర్హులు.

సమావేశ మందిరంలోకి రౌడీల్లా రావడం ఏంటి!

- జెడ్పీటీసీ రవికుమార్



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ రవికుమార్

బలిజిపేట: మండల సర్వసభ్య సమావేశ మందిరంలోకి టీడీపీ నేతలు రౌడీమూకల్లా రావడం ఏంటని జెడ్పీటీసీ రవికుమార్ ప్రశ్నించారు. వారిని కనీసం ఎమ్మెల్యే విజయచంద్ర, అధికారులు వారించకపోవడం దారుణమన్నారు. వారి తీరు భయభ్రాంతులకు గురి చేస్తుందని పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఆయన విలేకరులతో మంగళవారం మాట్లాడారు. మండల సర్వసభ్య సమావేశంలో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహిస్తుండగా టీడీపీ నేతలు లోపలకు వచ్చి వివాదాలకు తెరలేపడం ఏమిటన్నారు. సంబంధం లేని వ్యక్తులు హాల్‌లోకి దూసుకొచ్చి రసాభస చేయడం శోచనీయమన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా ఇటీవల గ్రామసభలు నిర్వహించి, పనుల ప్రతిపాదనలను సర్పంచ్‌లచే చేయించి, ఇప్పుడు వారిని కాదని వెండర్ పద్ధతిన చేపట్టడం ఏంటని సర్పంచ్‌లు ప్రశ్నించిన సమయంలో సంబంధం లేని టీడీపీ నేతలు లోపలకు ఒక్కసారిగా రావడంతో భయాందోళనలకు గురయ్యామన్నారు. సర్పంచ్‌ల హక్కులను కాలరాస్తే ఊరుకునేది లేదన్నారు. ఆయనతో పాటు ఎంపీపీ నాగమణి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో అప్రమత్తత ప్రధానం



సదస్సులో పాల్గొన్న రెవెన్యూ సిబ్బంది

సీతానగరం: ఆరోగ్యమే మహాభాగ్యమని దాన్ని గుర్తించి విధి నిర్వహణలో మొబైల్ వాడకంలో రెవెన్యూ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ ఉమామహేశ్వరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిజాం ఫిజియోథెరపి ఇనిస్టిట్యూట్(హైదరాబాద్) ప్రోగ్రాం సమన్వయకర్త రమేష్ ఆధ్వర్యంలో వీఆర్‌ఓలు, సర్వేయర్లకు ఆరోగ్య సమస్యలు, మొబైల్ వినియోగం ఇతర ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. ఇందులో పాల్గొన్న తహసీల్దార్ ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వహణలో ఒడిదుడుకులుంటాయని వాటిపై అవగాహన కలిగి సున్నితంగా పరిష్కరించుకోవాలని సూచించారు. రమేష్ మాట్లాడుతూ విధి నిర్వహణలో ఉద్యోగులకు వచ్చే ఒత్తిళ్లు, ఆందోళన నుంచి ఉపశమనం కల్గించడానికి ఫిజియోథెరపి, చిట్కాలు దోహదపడతాయన్నారు. ఆర్‌ఐ ఎస్.శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పాచిపెంటలో డిగ్రీ కళాశాల ఏర్పాటుకు డిమాండ్



తహసీల్దార్ రవికి వినతిపత్రాన్ని అందజేస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పాచిపెంట: పాచిపెంటలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. విద్యారంగం సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో విద్యార్థులు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి పండు మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 3480 కోట్లు రుపాయిలు విద్యాదీవెన, వసతిదీవెన బకాయిలను విడుదల చేయాలన్నారు. డిగ్రీలో మేజర్, మైనర్ ఆన్సర్ విధానాన్ని రద్దు చేయాలని, ఇంటర్ విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయాలని, పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచర్స్, ఏఎన్‌ఎంల పోస్టులను భర్తీ చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెస్ ఛార్జీలు 3వేల రుపాయిలకు పెంచాలని డిమాండ్ చేశారు. తల్లికి వందనం, రీయింబర్స్‌మెంట్‌ల అమలుపై స్పష్టత ఇవ్వాలని కోరారు.పార్వతీపురం మన్యం జిల్లాలోనే కేంద్రియ గిరిజన యూనివర్సిటీ నిర్మాణం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ రవికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కమిటీ సభ్యులు సింహాద్రి, సంజీవ్, రంజిత్, రమేష్, విద్యార్థులు పాల్గొన్నారు.

మండల సమావేశం రచ్చరచ్చ

- సమావేశంలోకి దూసుకొచ్చిన టీడీపీ నేతలు
- సంబంధం లేని వ్యక్తుల వాదోపవాదాలు



సమావేశం హాల్‌లోకి వచ్చిన టీడీపీ నాయకులు

బలిజిపేట: మండల సర్వసభ్య సమావేశం మంగళవారం రచ్చరచ్చగా సాగింది. ఎమ్మెల్యే విజయచంద్ర సమక్షంలో ఆ పార్టీ నేతలు, సమావేశంతో సంబంధం లేని వ్యక్తులు హాల్‌లోకి దూసుకొచ్చి తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరించారు. ఎంపీపీ నాగమణి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం మంగళవారం జరిగింది. సమావేశం ప్రారంభంలోనే సభ్యులు కాని టీడీపీ నేతలు హాల్‌లోకి ప్రవేశించి తమ ఇష్టం వచ్చినట్టు వ్యవహరించారు. సమావేశం ప్రారంభమైన కొంత సమయానికి ఎమ్మెల్యే విజయచంద్ర హాజరయ్యారు. వివిధ శాఖల పనితీరును సమీక్షించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ కేశవరావు మాట్లాడుతూ ఇటీవల తమ శాఖ ద్వారా ప్రతిపాదనలు చేసి పంపిన పనుల విషయంలో సభ్యులు తమ సందేహాలను లేవనెత్తారు. అందులో భాగంగా వెండర్ కోడ్ పద్ధతిన పనులు నిర్వహించరాదని, సర్పంచ్‌లచే పనులు చేయించి వారి ఖాతాల్లోకే నగదు జమ అయ్యే విధంగా పనులు చేపట్టాలని సభ్యులు కోరారు. ఈ విషయంలో సమావేశంలో వాగ్వాదాలు జరుగుతుండగా పచ్చమూక సభ్యులు ఒక్కసారిగా లోపలికి వచ్చి ఎమ్మెల్యే సమక్షంలో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలో సభ్యులు పలువురు సభా మర్యాదలు పాటించకుండా ఇతరులను లోపలకు ఎలా రానిచ్చారని పక్కనే ఉన్న అధికారులను ప్రశ్నించినా వారు మౌనం దాల్చడంతో అంతా రసాభాసాగా సాగింది.

ఎమ్మెల్యే కూడా వారిని వారించపోవడంతో సభలో మర్యాదలు పాటించని వీరి వైఖరితో విసిగిన ఎంపీపీతో పాటు జెడ్పీటీసీ రవికుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సమావేశం నుంచి బయటకు వెళ్లిపోయారు. అయితే ఎంపికైన సభ్యులు లేకపోతే ఏంటని అనుకున్నారో ఏమో అధికారులు సమావేశాన్ని కొనసాగించారు. సభాధ్యక్షురాలు లేకుండా సమావేశం కొనసాగించడంపై సభ్యులు ఆశ్చర్యపోయారు. గత ఐదేళ్లలో ఇలాంటి సమావేశం చూడలేదని పేర్కొన్నారు. ఎంపీడీఓ విజయలక్ష్మి, తహసీల్దార్ రత్నకుమారి, అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

పంచారామ, పంచశైవ పుణ్య క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

సాలూరు: కార్తీక మాసంలో పంచారామ, పంచశైవ పుణ్యక్షేత్రాలకు ఆర్టీసీ బస్సు సర్వీసు సదుపాయం కల్పిస్తున్నట్లు పట్టణ ఆర్టీసీ డిపో మేనేజర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట పంచారామ పుణ్యక్షేత్రాలకు, సంగం, నారాయణపురం, అడ్డాపుశీల, గుంప, తోటపల్లి పంచ శైవ క్షేత్రాలకు అల్ట్రాడీలక్స్, ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు బస్సు సర్వీసులు నడపనున్నట్టు తెలిపారు. నవంబర్ 3, 10, 17, 24 తేదీలలో ఈ సర్వీసులు నడుపుతామని, భక్తుల డిమాండ్ ఉంటే మిగిలిన రోజుల్లోనూ ఈ సర్వీసులు నడుపుతామని తెలిపారు. వివరాలకు 99592 25622, 99499 16017, 73829 19883, 73829 21239 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

సీసీఆర్‌సీ కార్డులున్న వారికి రుణాలు



పంటలను పరిశీలిస్తున్న ఏఓ అవినాష్

సీతానగరం: మండలంలో వ్యవసాయ శాఖ ద్వారా సీసీ ఆర్‌సీ కార్డులు పొందిన రైతులు నిర్దేశించిన బ్యాంకుల్లో రుణాలు పొందవచ్చని ఏఓ ఎస్.అవినాష్ అన్నారు. మండలంలోని ఆర్.వెంకంపేట గ్రామంలో ఏఓ రైతులతో కలిసి పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలు రైతులు సీసీఆర్‌సీ కార్డు తీసుకున్న వారు బ్యాంకుల్లో తమ అవసరాలకు రుణాలు తీసుకోవాలని సూచించారు. ఆయనతో పాటు వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

గిరిజన హక్కుల కోసం పోరాడిన కోరన్న, మంగన్న



మాట్లాడుతున్న రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి వర్మ

మక్కువ: గిరిజన హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడిన కోరన్న, మంగన్న భావితరాలకు ఆదర్శమని రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి దంతులూరి వర్మ అన్నారు. మండలంలోని తెలగడవలస గ్రామంలో రైతు కూలీ సంఘం జిల్లా అధ్యక్షుడు ఊయక ముత్యాలు అధ్యక్షతన అమరవీరులు కోరన్న, మంగన్నల వర్ధంతి సభ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ కోరన్న, మంగన్న బాటలోనే అంతా నడుద్దామన్నారు. హక్కుల కోసం సంఘటితంగా పోరాటం చేద్దామన్నారు. రైతు కూలీ సంఘం జిల్లా కమిటీ సభ్యులు పీడిక అసిరి మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టం, ఐటీడీఏ, జీసీసీ, సంక్షేమ పథకాలు, భూసంస్కరణలు అమల్లోకి తెచ్చినా సక్రమంగా అమలు చేయడం లేదన్నారు. వీటి అమలు కోసం ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో రైతు కూలీ సంఘం నాయకులు ఎం.ప్రసాద్, కె.చిన్నప్ప, పెద్ద సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఆయుర్వేద దినోత్సవం



బూర్జ ఆరోగ్య మందిర్‌లో ఆయుర్వేద దినోత్సవం

సీతానగరం: జాతీయ ఆయుర్వేద దినోత్సవం సందర్భంగా బూర్జ ఆయుర్వేదిక్ ఆయుష్మన్ ఆరోగ్య మందిర్‌లో ఆయుష్ వైద్యాధికారిణి టి.హేమాక్షి ఆధ్వర్యంలో ఆయుర్వేద దినోత్సవం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జాతీయ స్థాయిలో మొట్టమొదటి భారతీయ వైద్యం ద్వారా సేవలందించడం జరుగుతుందన్నారు. ఆయుర్వేదం ఆవిర్భావానికి మూల కారకులైన ధన్వంతరి ఆవిర్భావం గురించి వివరించారు. దీర్ఘకాలిక వ్యాధుల నివారణకు ఆయుర్వేద ముందులు దోహదపడతాయన్నారు. జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో హెచ్‌ఎం శంకరరావు ఆధ్వర్యంలో ఎంఈఓ జి.సూరిదేముడు ఔషధ మొక్కలు నాటి ఉపయోగాలపై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఆయుష్ సిబ్బంది, యోగ ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.

ప్రకటనకే పరిమితమైన డీఎస్సీ ఉచిత శిక్షణ

పార్వతీపురం టౌన్: డీఎస్సీ అభ్యర్థుల కోసం రాష్ట్ర ప్రభుత్వం ఇప్పిస్తామని చెప్పిన ఉచిత శిక్షణ ప్రకటనలకే పరిమితమైందని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్‌కుమార్ మంగళవారం ఒక ప్రకటనలో విమర్శించారు. గిరిజన అభ్యర్థులకు తొలిత గుమ్మలక్ష్మీపురం, పార్వతీపురం తరువాత రెండు చోట్ల ఉచిత డీఎస్సీ శిక్షణ ఇస్తామని ప్రకటించినా పలుమార్లు గడువు పెంచుతూ వస్తుందన్నారు. నేటికీ ఎటువంటి శిక్షణ ప్రారంభించలేదని తెలిపారు. ఇప్పుడేమో ఎస్సీ, ఎస్టీలకు కలిపి ఎస్సీ స్టడీ సర్కిల్ ద్వారా విశాఖలో శిక్షణ ఇస్తామని కాలయాపన చేయడం ఏమాత్రం సరైందని కాదని ధ్వజమెత్తారు. తక్షణమే ఐటీడీఏ కేంద్రంలో గిరిజన అభ్యర్థుల కోసం ఉచిత డీఎస్సీ శిక్షణ ఆఫ్‌లైన్ విధానంలో ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

రెవెన్యూ అధికారుల తీరు శోచనీయం

మక్కువ: మండలంలోని సరాయివలస గ్రామానికి చెందిన వృద్ధుడు ఆవాల అప్పలస్వామి ఇంటి స్థలాన్ని అదే గ్రామానికి చెందిన ఓ మహిళకు రెవెన్యూ అధికారులు అప్పజెప్పడం అన్యాయమని గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ ఆరోపించారు. బాధితులతో కలిసి ఇంటి స్థలాన్ని మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరాయివలసలో 30 సంవత్సరాలు కిందట ప్రభుత్వం పేదల ఇళ్ల స్థలాల కోసం భూమి కొనుగోలు చేసిందని, ఆ భూమిలో ఆవాల అప్పలస్వామి 30 సంవత్సరాలుగా ఇల్లు కట్టుకొని జీవిస్తున్నారని తెలిపారు. 1996లో పొజిషన్ సర్టిఫికెట్ ఇచ్చారని, అప్పటి నుంచి స్థలం వృద్ధుడి అనుభవంలోనే ఉందన్నారు. అయినా అప్పలస్వామి ఇంటి స్థలాన్ని కొంతమంది ఆక్రమించుకున్నారని ఆరోపించారు. ఈ విషయమై బాధితులు అప్పలస్వామి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్టు ప్రభాకర్ గుర్తు చేశారు. రెవెన్యూ అధికారులు ఇప్పటికైనా తాము చేసిన తప్పిదాన్ని సరి చేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదకరంగా బైపాస్ రహదారి



బైపాస్ రహదారిలో ఏర్పడిన గొయ్యి

పార్వతీపురం టౌన్: ప్రమాదకరంగా మారిన బైపాస్ రహదారిపై ఏర్పడిన గోతులను పూడ్చాలని పట్టణ వాసులు కోరుతున్నారు. నిత్యం రద్దీగా ఉండే పార్వతీపురం బైపాస్ రోడ్డులో పెద్ద పెద్ద గోతులు ఏర్పడడంతో ప్రయాణికులు తరచూ ప్రమాదాల బారిన పడుతున్నారని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ లారీలు సైతం ఈ గోతుల్లో దిగబడి గంటల తరబడి ట్రాఫిక్‌కు అంతరాయం కలుగుతుందని పేర్కొంటున్నారు. అయినా పాలకుల్లోగానీ, అధికారుల్లోగానీ చలనం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒడిశా రాయగడతో పాటు గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, వీరఘట్టం, శ్రీకాకుళం తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించే ప్రజలు ఈ రహదారితో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అధికారులు స్పందించాలని కోరుతున్నారు. రాత్రిపూట ఎక్కువగా ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.

సైబర్ నేరాలు తగ్గించే దిశగా చర్యలు

- బేసిక్ పోలీసింగ్ విధానాన్ని పోలీసు అధికారులు, సిబ్బంది అమలు చేయాలి
- ఎస్పీ మాధవ్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం టౌన్: సైబర్ నేరాలు తగ్గించే దిశగా చర్యలు చేపట్టాలని ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి అన్నారు. పోలీసు మల్టీఫంక్షన్ హాల్‌లో మంగళవారం నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెూంగార్డు నుంచి ఐపీఎస్ అధికారుల వరకు ఎంతో శ్రమించి, పోలీసు శాఖ ప్రతిష్టను ఇనుమడింపజేసారని, ఆ ప్రతిష్టను మరింతగా పెంచేందుకు పోలీసు అధికారులు, సిబ్బంది సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. పోలీసుస్టేషన్‌కు న్యాయం కోసం వచ్చే నిరుపేదలు, మహిళలు, వృద్ధులు పట్ల మర్యాద పూర్వకంగా వ్యవహరించాలని, వారికి అందుబాటులో ఉంటూ, వారి సమస్యలను శ్రద్ధతో విని, న్యాయం చేసేందుకు చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలన్నారు. పోలీసు అధికారులు, సిబ్బంది వ్యవహార తీరులో మార్పులు చేసుకోవాలని, ఫిర్యాదు చేసేందుకు వచ్చే వారి పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించాలన్నారు.

బేసిక్ పోలీసింగ్ తప్పనిసరి

పోలీసు వ్యవస్థలో మార్పులు వచ్చినప్పటికీ నేరాల నియంత్రణలో గతంలో అవలంభించిన బేసిక్ పోలీసింగ్‌ను మరిచిపోవద్దని, గ్రామ సందర్శనలు, పెట్రోలింగ్, రాత్రి బీట్లు, పగలు బీట్లు చేయాలన్నారు. గ్రామాల్లో చెడు నడత కలిగిన వ్యక్తులు, శాంతిభద్రతల సమస్యల గురించి విచారణ చేయాలన్నారు. బేసిక్ పోలీసింగ్ చేయడం వలన ప్రజలకు మేలు జరుగుతుందని, నేరాలు తగ్గుముఖం పడతాయన్నారు.

సవాల్‌గా తీసుకోవాలి

గతంలో నమోదైన నేరాల కంటే ప్రస్తుతం కొత్త తరహాలో నేరాలు నమోదవుతున్నాయని, వీటిని సవాల్‌గా తీసుకొని, పోలీసుల పనితీరు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొత్త తరహాలో నమోదవుతున్న డ్రగ్స్, సైబరు నేరాలను దర్యాప్తు చేసేందుకు అవసరమైన మెలకువలను పోలీసు అధికారులు అందిపుచ్చుకోవాలన్నారు. ప్రజల్లో చైతన్యం నింపేందుకు సోషల్ మీడియాను వినియోగించుకోవాలని అధికారులను సూచించారు.

రహదారి ప్రమాదాల నియంత్రణకు చర్యలు

రహదారి ప్రమాదాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. క్రమం తప్పకుండా రహదారి భద్రతా నియమాలపై అవగాహన కలిగించాలన్నారు. పెండింగ్ కేసుల మీద దృష్టి పెట్టాలని, గంజాయి కేసుల్లో ప్రాపర్టీ సీజ్ చేసినప్పుడు తగు జాగ్రత్తలు పాటించాలన్నారు. పోలీసు విధులను సమర్థవంతంగా నిర్వహించే అధికారులను గుర్తించి, వారిని ప్రోత్సహిస్తామని, తప్పు చేసే అధికారులు, సిబ్బందిపై క్రమ శిక్షణ చర్యలు తీసుకునేందుకు వెనుకాడబోమన్నారు.

మాదకద్రవ్యాల రవాణాపై ప్రత్యేక శ్రద్ధ

జిల్లాలో నమోదవుతున్న నేరాల తీరును, శాంతిభద్రతల అంశాలను, వాటి పరిరక్షణకు జిల్లా పోలీసుశాఖ చేపడుతున్న చర్యలను వివరించారు. అదే విధంగా జిల్లాలో గంజాయి అక్రమ రవాణ, అమ్మకాలు, వినియోగించే వారిపై జిల్లా పోలీసులు చేపడుతున్న చర్యలను తెలిపారు. గంజాయి అక్రమ రవాణ నియంత్రణకు ఇతర రాష్ట్రాల నుంచి జిల్లా మీదుగా ఇతర ప్రాంతాలకు మార్గాలను గుర్తించి, ఆయా మార్గాల్లో చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆకస్మికంగా, వేర్వేరు చోట్ల, వేర్వేరు సమయాల్లో డైనమిక్ వాహన తనిఖీలను చేపడుతున్నట్లుగా వివరించారు. సమావేశంలో అదనపు ఎస్పీ డా.ఓ.దిలీప్ కిరణ్, పార్వతీపురం ఏఎస్పీ సురాన అంకిత మహావీర్, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ ఎం.రాంబాబు, ఎస్‌బీ సీఐ మురళీధర్, డీసీఆర్‌బీ సీఐ ఎర్రంనాయుడు, సైబర్ సెల్ సీఐ అప్పారావు, జిల్లాలో గల సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.